క్లుప్తంగా

కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా ఉమ


ఉమ

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంనకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఉమారఘువీర్‌ను కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమారఘువీర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు.

ఎంపీ ఉత్తమ్‌కు సన్మానం


ఎంపీ ఉత్తమ్‌ను సన్మానిస్తున్న నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మెంబర్‌గా నియామకమైన నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు రామిరెడ్డికి సత్కారం


రామిరెడ్డిని సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

హుజూర్‌నగర్ : టీటీడీ బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసి పట్టణానికి వచ్చిన హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డిని బుధవారం పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా సాముల రామిరెడ్డిని మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు సుతారి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, హనుమంతరావు, సుంకరి ఉపేందర్, పిల్లుట్ల రవి, కార్తీక్, మాల మహానాడు సంఘం నాయకులు బెంజిమెన్, శ్రీనివాస్, నరేందర్, పుల్లయ్య పాల్గొన్నారు.

18 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు

కోదాడ : పట్టణంలో ఈనెల 18 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని కోదాడ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యాదా రమేష్ కోరారు. బుధవారం కోదాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బొలిశెట్టి కృష్ణయ్య, అక్కిరాజు యశ్వంత్, కొమరగిరి రంగారావు, అంబడికర్ర శ్రీనివాసరావు, తిపిరిశెట్టిరాజు, మేళ్లచెరువు కోటేశ్వరరావు, అనంతుల సతీష్, కొమరగిరి గోపాల్‌కిషన్ రావు, ఓరుగంటి బ్రహ్మం పాల్గొన్నారు.

రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ : చిరువ్యాపారులు, ఉద్యోగస్తుల కోసం సుధాబ్యాంక్ నిర్వహిస్తున్న రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలని సుధా అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ కోరారు. బుధవారం బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుణ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తక్కువ వడ్డీతో అన్ని రకాల రుణాలు తమ బ్యాంక్ అందిస్తుందని కోదాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు రుణాలను తీసుకొని వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 8వ తేదీన ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

హుజూర్‌నగర్‌రూరల్ : అక్టోబర్ - 1 - 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సర్పంచ్ గుజ్జుల సుజాతాఅంజిరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని అమరవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఓటర్ జాబితాలో తప్పులుంటే సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సౌజన్య, సీసీ పరిమళ, వీఓఏ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


హుజూర్‌నగర్ : కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు


మోతెలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపికలు, కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుని, రుక్మిణి, సత్యభామ వేషధారణలో ఆకట్టుకున్నారు. నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుండ్లపల్లి నాగేశ్వరరావు, డైరెక్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్లలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో గోపూజ చేసి అనంతరం ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత, సంధ్య, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, నటరాజ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.


కోదాడలో..


నేరేడుచర్ల : గోపూజ చేస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

కోదాడ : పట్టణంలోని జయ పాఠశాలలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల చేత ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధరల పెంపుపై సీపీఎం నిరసన


జడ్పర్ల - కోదాడ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలకు వ్యతిరేకంగా బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పర్ల- కోదాడ ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె.యాకుబ్ మాట్లాడుతూ హర్యానాలో హిందూ, ముస్లింల మధ్య మధ్య, మణిపూర్‌లో నాగా- కూకీల మధ్య, కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీల పేరుతో సినిమాలు, రజకారుల ఫైల్స్ పేరుతో తెలంగాణలో సినిమా తీసి చరిత్రను మార్చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసి మతోన్మాదం, మూఢ నమ్మకాలు, కుల మతాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో దోసపాటి భిక్షం, మహబూబ్ అలీ, నందిపాటి మట్టయ్య, ఆకుల అరవింద్, దోసపాటి సుధాకర్, తంబడి భిక్షం, యానాల సోమయ్య, బొల్లెపల్లి శ్రీనివాస్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఓటు హక్కుపై అవగాహనలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో ఓటు హక్కు వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ టీచర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మరణించిన వారి పేర్లు తొలగించాలి

హుజూర్‌నగర్ : మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కోరారు. హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో రెండు సార్లు నమోదైన వారిని కూడా తొలగించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, డీటీ కమలాకర్, పార్టీ నాయకులు మందరవి, యాల్లవుల రాములు, మీసాల కిరణ్, కె.వెంకటేశ్వర్లు, కె.నరేష్, శంబిరెడ్డి, పి.ఉస్సేన్, సంపత్‌రెడ్డి, కిషోర్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు

అంగన్‌వాడీలో మురిగిన కోడి గుడ్లు పంపిణీ

చిలుకూరు : మండలంలోని రామ్‌చంద్రానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అభం శుభం తెలియని చిన్నారులకు మురిగిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఇళ్ల వద్ద చిన్నారుల తల్లులు గుడ్లను పగులగొట్టగా మురిగిపోయి కనిపించాయి. కొన్ని గుడ్లల్లో చనిపోయిన కోడి పిల్లలు ఉన్నట్లు వారు తెలిపారు. దీంతో ఈ విషయంపై అంగన్‌వాడీ టీచర్‌కు గ్రామస్తుల మధ్య వాగ్వివాదం జరిగింది. అంగన్‌వాడీ టీచర్ బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. గతంలో కూడా ఇలానే మురిగిన కోడి గుడ్లు పంపిణీ చేశారని ఆ సమయంలో అంగన్‌వాడీ టీచర్‌పై విచారణ చేశారని కానీ ఆమెపై చర్యలు తీసుకోలేదని అందుకే ఆమె మళ్లీ బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ పాయిలీ రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్‌పై పలు ఫిర్యాదులు వచ్చాయని ఆమెకు ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ తెలిపారు.


మురిగిన కోడి గుడ్లు

సంపద వనాలపై శ్రద్ధ వహించాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : సంపద వనాలపై గ్రామపంచాయతీ పాలకవర్గం, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రం శివారులోని ఎస్‌ఎస్పీ కాలువ కట్టపై సంపద వనాల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సంపద వనాల పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అటవీ శాఖాధికారి సతీష్‌కుమార్, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఏపీఓ శైలజ, టీఏ శేఖర్, ఎఫ్ఏ నారగాని కృష్ణవేణి, సర్పంచ్ చింతకాయల ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత పాల్గొన్నారు.


మునగాలలో సంపద వనాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎఫ్ఓ

మట్టి సేకరించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : దేశంలో అమరవీరులకు వందనం సమర్పణ కోసం ప్రతిఒక్కరూ పార్టీలకతీతంగా మట్టిని సేకరించాలని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేములు శేఖర్ రెడ్డి కోరారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని వేపలసింగారంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు అన్నెం మోహన్‌రెడ్డి, నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కుక్కడపు లీలావతి జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్‌కి వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వామి, గోపి, సతీష్, అనంత రాములు, రామ్ నరేష్, గుండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశ్వాపురంలో నేడు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో గురువారం ఇళ్ల స్థలాలు లేని పేదలకు గురువారం ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ టి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేతుల మీదుగా ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రిషితకు అభినందన

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అనంతుల ఆంజనేయులు కూతురు రిషిత ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ పుట్టా రమేష్ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అనంతుల ఆంజనేయులు, సీఈఓ యలమందరావు, సిబ్బంది శ్రీనివాసరావు, పుట్టా సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కోర్టు ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి

హుజూర్‌నగర్ : రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ఈ నెల 12న హుజూర్‌నగర్‌లో నూతన అదనపు జిల్లా కోర్టును వర్చువల్ పద్ధతిలో ప్రారంభించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక కోర్టులోని హాల్లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు న్యాయవాదుతో కమిటీలను ఏర్పాటు చేశారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్‌లను వారి చాంబర్లలో కలిసి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపిక హర్షణీయం

పాలకవీడు : కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేయడం హర్షనీయమని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించి ఉత్తమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో ఉమ్మడి రాష్ట్రంలో ఎవరికీ చోటు దక్కలేదన్నారు. దేశవ్యాప్తంగా పేరున్న నేత ఉత్తమ్ అని అన్నారు. అహర్నిశలు పార్టీ , ప్రజల సంక్షేమం కోసం శ్రమించే నాయకుడు, ఓటమి ఎరుగని నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని కొనియాడారు. అందుకే ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థుల నియామకానికి కమిటీలో చోటు కల్పించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ మాలోతు బుజ్జి మోతీలాల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రావు, ఎంపీటీసీ ఉపేందర్, రాంబాబు, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బ్రహ్మాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, దేవీసత్యప్రసాద్, అప్పలాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం..


సూర్యాపేట, కోదాడ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓయూ జేఏసీ నాయకుడు జటంగి సురేష్

యువకులకు అండగా బీఆర్‌ఎస్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : పేదలు, యువకులకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మునీర్‌తో పాటు పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చందు నాగేశ్వరరావు, తొగరు రమేష్, కట్టా సతీష్, బత్తుల ఉపేందర్, ఖాజామొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మేళ్లచెరువు : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామాపురం గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత పరిపాలనను సులభతరం చేస్తూ మారుమూల గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో పాటు, మైహోం సిమెంట్ పరిశ్రమ సహకారంతో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ పద్మగోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. బుధవారం కోదాడ పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ పార్టీ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోదాడ పట్టణంలో 10 వేల మెజార్టీ సాధించబోతున్నామని, ప్రజలను చైతన్యం చేసి ఓటు వేయించుకోవాలని ఆమె కోరారు. అధికార పార్టీ అన్ని రంగాలలో విఫలమైందని ఆమె ఆరోపించారు. దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లలో అవినీతికి పాల్పడ్డారని దాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, బషీర్, పారసీతయ్య, వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ సాహితి


ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ సాహితి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ సాహితి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో పారిశుద్ధ్యం, దోమల నిర్మూలన చర్యలను మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, బోదకాలు, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పీహెచ్‌ఎన్ నూర్జహాన్ బేగం, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, మాధవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డా.కళ్యాణ్ చక్రవర్తి


మునగాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కళ్యాణ్ చక్రవర్తి

మునగాల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డా.కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులతో పాటు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న తీరు, మాత్రల పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ఆరోగ్య కార్యకర్తల సలహాలు, సూచనలు పాటించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రవీందర్ పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ పూజ, ల్యాబ్ టెక్నీషియన్ సీఎస్.కవిత స్టాఫ్ నర్స్, ఫార్మసిస్టు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్


ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

కోదాడరూరల్ : ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును పోలీసుల ద్వారా అతనికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఆటోడ్రైవర్. వివరాలు.. మూగల శివ అనే ఆటో డ్రైవర్‌కు ఖమ్మం క్రాస్‌రోడ్‌లో ఓ పర్సు దొరికింది. పర్సులో రూ.2 వేల నగదు, ఏటీఎం కార్డులతో పాటు పలు కార్డులు ఉన్నాయి. ఆ పర్సును ఆటోడ్రైవర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. దీంతో ఎస్ఐ రామాంజనేయులు ఆ పర్సుకు సంబంధించిన వ్యక్తి వివరాలు సేకరించగా ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన యండ్రాతి రాకేష్‌గా గుర్తించారు. దీంతో అతన్ని స్టేషన్‌కు పిలిపించి పర్సు అందజేశారు. పర్సు స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ శివను ఎస్ఐ అభినందించి శాలువాతో సన్మానించారు.

దోపిడీ దొరల చేతుల్లోకి తెలంగాణ


సీడీ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి, నాయకులు

కోదాడ : పోరాడి సాధించుకున్న తెలంగాణ దోపిడీ దొరల చేతుల్లోకి వెళ్లి అప్పుల కుప్పగా మారిందని, మళ్లీ తెలంగాణ నవ నిర్మాణం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. బుధవారం కోదాడలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో 'ఊరు మనదిరా.. కాంగ్రెస్ మనదిరా..' పేరుతో తయారు చేయించిన పాటల సీడీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో తెలంగాణకు మంచి రోజులు రానున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషిచేస్తానని, పార్టీ అవకాశం ఇస్తే ఎన్నికల బరిలో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రామరాజు, నారాయణ, కెన్నడీ, ఎస్ఎస్‌రావు, పాష, జలందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి

హుజూర్‌నగర్ : ఎస్సీ వర్గీకరణ కోసం అన్ని ప్రధాన రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచాల్సిన సమయం ఆసన్నమైందని ఎంఎస్‌పీ నియోజవర్గ ఇన్‌చార్జ్ కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ మాదాసు గోపి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై అలాగే ప్రధాన రాజకీయ పార్టీలపై ఒత్తిడి పెంచాలన్నారు. దీనిలో భాగంగా జిల్లాలు, నియోజవర్గాలు, మండల కేంద్రాల్లో జరిగే దీక్షలలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయా సంఘాల మండల నాయకులు బి.ప్రసాద్, మహేష్, బి.వీరబాబు, ఆర్.రమేష్, ఎం.విజయ్, ఎల్.నాగరాజు, పి.మధు, ఆర్.విజయ్, ఎం.వంశీ పాల్గొన్నారు.